International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-5, May, 2022
Impact Factor: 6.023

# వాసిరెడ్డి సీతాదేవి నవలల్లో స్త్రీ

డా. పొట్లూరి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి,
ఏలూరుజిల్లా – 534460
చరవాణి: 9390883982
మెయిల్: johnveslyp@gmail.com

**1. ఉపోద్ఘాతం:**

తెలుగుసాహిత్యంలో స్త్రీవాద సాహిత్యానికి ఒక ప్రత్యేక అస్తిత్వం, గుర్తింపు ఉంది. ఎన్ని విమర్శలు వచ్చినా లెక్కచేయకుండా అనేకమంది రచయిత్రులు తమతమ రచనలతో స్త్రీవాద సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. సంఘ పరంగా స్త్రీ ఎదుర్కొంటున్న వివక్షతో పాటు, శారీరకంగా మానసికంగా వివిధ రంగాలలో ఎదుర్కొంటున్న అణచి వేతల్ని, వివక్షల్ని స్త్రీలు తమ రచనలలో ధైర్యంగా వ్యక్తపర్చారు. ఈ క్రమంలోనే స్త్రీవాద సాహిత్యం ఒక ప్రత్యేక ఉద్యమంగా 1985 తర్వాత తెలుగుసాహిత్యంలో ప్రవేశించింది. అప్పటినుండి ఇప్పటివరకు స్త్రీలు తమ కవిత్వం, కథలు, నవలలు మొదలైన అనేక ప్రక్రియల ద్వారా స్త్రీ జీవితాన్ని చాలా ప్రతిభావంతంగానూ, ప్రభావవంతంగానూ చిత్రించారు.

**2. వాసిరెడ్డి సీతాదేవి జీవితం:**

1985 తర్వాతే స్త్రీవాద సాహిత్యం ఒక సిద్ధాంతంగా, ప్రక్రియగా తెలుగుసాహిత్యంలో స్థిరపడినా, అంతకు ముందే అంటే దాదాపు 1960 లలోనే స్త్రీ జీవితాన్ని, స్త్రీల సమస్యల్ని ఇతివృత్తంగా తీసుకుని విస్తృతంగా నవలలు రాసిన రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి. స్త్రీ జీవితంలోని అనేక కోణాలను తన నవలల్లో విస్తృతంగా చర్చించింది. "నేను మార్క్సిస్టును. రచయితకు మార్క్సిస్టు దృక్పథం లేకపోతే ఆ రచన అసంపూర్ణమూ, అపరిమితమూ అవుతుంది. సాహిత్యమూ, రాజకీయమూ నా దృష్టిలో వేరువేరు కాదు. అందుచేతనే ఈ దేశంలో రచయితలు విధిగా రాజకీయాల్లో పాల్గొని తీరాలి" అని తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లుగా తన రచనల్లో వ్యక్తపర్చింది సీతాదేవి.
సామాన్య రైతు కుటుంబంలో 1933 లో గుంటూరుజిల్లా చేబ్రోలులో పుట్టిన వాసిరెడ్డి సీతాదేవి జీవితం చిన్న తనంలో అనేక నిషేధాల మధ్య గడిచింది. తన చుట్టూ వున్న ప్రాంతాలలో స్త్రీలపై జరుగుతున్న అనేక దాడుల్ని, అణచి వేతల్ని ప్రత్యక్షంగా చూసి ఎంతో వ్యథ చెందింది. వాటినే తన నవలల్లో, కథల్లో బలంగా చిత్రించింది. స్త్రీలను కేవలం భోగ వస్తువుగానే చూడడం ఆమెను కలచివేసింది. కుటుంబాలలో వివాహం పేరుతో జరుగుతున్న హింసను సహించలేక పోయింది. స్త్రీలకు స్వంత వ్యక్తిత్వం లేకుండా చేసి వారిని బానిసలుగా, ఇంట్లో పనిమనుషులుగా చూస్తున్న వివాహ వ్యవస్థను అసహ్యించుకుంది. అటువంటి భావాలతోనే వివాహానికి స్వస్తిచెప్పి జీవితాంతం పెళ్ళికి దూరంగా గడిపింది. అందుకే సమాజంలో సర్వ సామాన్యాలైపోయిన అనేక అణచివేతల్ని ధైర్యంగా తన రచనల ద్వారా ప్రశ్నించగలిగింది.

**3. వాసిరెడ్డి సీతాదేవి రచనలు:**

తన చుట్టూ వున్న సమాజంలో స్త్రీలపై జరుగుతున్న అన్యాయాల్ని ఎదిరించే క్రమంలో రచనా వృత్తిని చేపట్టిన సీతాదేవి 1950లో కథారచనతో తన సాహిత్య ప్రస్థానాన్ని ప్రారంభించారు. దాదాపు 40 నవలలు, 10 కథా సంకల నాలు, 8 అనువాద పుస్తకాలు, 5 పిల్లల పుస్తకాలు ఆమె రచించారు. బాలభవన్ సంచాలకురాలిగా, యువజన సర్వీసుల శాఖ ఉపసంచాలకురాలిగా పనిచేశారు. నంది ఫిల్మ్ అవార్డు, తెలుగు అడ్వైజర్ రిపోర్ట్, దూరదర్శన్ అడ్వైజర్ కమిటీ, ఆంధ్రప్రదేశ్ సాహితీ అకాడమిలో సభ్యులుగా కూడా సేవలందించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్లు అందుకున్నారు. తెలుగుసాహిత్యానికి తన రచనల ద్వారా ఎంతో సేవ చేసిన వాసిరెడ్డి సీతాదేవి 2007 ఏప్రిల్ 13 వ తేదీన హైదరాబాదులో మరణించారు.

**4. వాసిరెడ్డి సీతాదేవి నవలలు:**

1960, 70లలో విస్తృతంగా వెలువడిన కాల్పనిక సాహిత్యానికి భిన్నంగా తన రచనల్లో వాస్తవికతను ప్రవేశ పెట్టింది వాసిరెడ్డి సీతాదేవి. ఈ క్రమంలో ఆమె రాసిన అనేక నవలలు ఎంతో ప్రాధాన్యాన్ని, ప్రత్యేకతను సంతరించు కున్నాయి. తన నవలల్లో స్త్రీ జీవితాన్ని ఒక ప్రత్యేక కోణంలో చిత్రించారు. ఒకపక్క వివాహాల పేరుతోనూ, అణచివేతల పేరుతోనూ స్త్రీలపై జరుగుతున్న అన్యాయాల్ని తన నవలల్లో చిత్రిస్తూనే, మరోపక్క విచ్చలవిడి జీవితానికీ, విలాసానికీ అలవాటుపడి తమ జీవితాల్ని తామే నాశనం చేసుకుంటున్న స్త్రీ జీవితాన్నికూడా సీతాదేవి చిత్రించింది. వాసిరెడ్డి సీతా దేవి తన ప్రతీ నవలలోనూ స్త్రీ జీవితంలోని వివిధ కోణాలను చిత్రించారు. స్త్రీగా పుట్టినప్పటి నుండి చనిపోయే వరకూ సంఘంలో స్త్రీ అనుభవిస్తున్న ఆవేదనకూ, అంతులేని మానసిక సంఘర్షణకు ఆలవాలంగా తన నవలలను తీర్చిదిద్దారు. చాలా నవలలను స్త్రీ దృక్కోణం నుండి రాసిన కొన్ని ముఖ్యమైన నవలల్లో స్త్రీల వేదనను ఈ వ్యాసంలో వివరిస్తాను. సీతాదేవి నవలల్లో ఈ క్రిందివి బాగా ప్రసిద్ధి పొందాయి.

1. మట్టిమనిషి 2. సమత 3. మరీచిక 4. రాబందులు రామచిలుకలు
5. వైతరణి 6. అర్చన

**4.1. మట్టిమనిషి**

సీతాదేవి నవలల్లో బాగా ప్రసిద్ధి పొందిన, 14 భాషలలోకి అనువాదం చేయబడిన నవల మట్టిమనిషి. పుట్టినప్పటి నుండి చనిపోయే వరకూ ప్రతీ వ్యక్తికి మట్టితో విడదీయరాని అవినాభావ సంబంధం ఉంది. భారతదేశం ప్రధానంగా వ్యవసాయాధారిత దేశం. ఎంతోమంది రైతులు మట్టిని నమ్ముకుని వ్యవసాయం చేసి తమ ఊపిరిని మట్టిలోనే చూసుకుంటూ బ్రతుకుతున్నారు. మనిషికి మట్టితో గల సంబంధాన్ని వివరిస్తూ సాంబయ్య, వరూధిని, రవి అనే మూడుతరాలకు చెందిన కథను ఈ నవలలో వివరిస్తారు రచయిత్రి. ప్రధాన పాత్ర సాంబయ్య తన జీవితమంతా వ్యవసాయానికే అంకితం చేసిన నేటి రైతుకు ప్రతినిధిగా మనకు ఈ నవలలో కనిపిస్తాడు. వ్యవసాయాన్ని నమ్ముకుని ఎంతో బ్రతికి చెడిన సాంబయ్య చిత్త చాంచల్యా నికి లోనై తనను అవమానించిన బలరామయ్య కూతుర్ని తన కొడుకైన వెంకటపతికి చేసుకుంటాడు. ఈ పెళ్లితోనే నవల చాలా మలుపులు తిరుగుతుంది.

ఇక నవలలో ఇంకో ప్రధాన పాత్రగానే కాకుండా సాంబయ్యకు ప్రత్యర్థిగా కోడలైన వరూధిని పాత్ర కనిపిస్తుంది. సాంబయ్య మట్టిని నమ్ముకుని జీవిస్తే వరూధిని తన అందచందాల్ని నమ్ముకుని జీవిస్తుంది. తనలాంటి

అందచందాలున్న ఆడదానికి వెంకటపతిలాంటి మొద్దు భర్తగా రావడం ఆమెకు నచ్చదు. పైగా ఆ ఇంటిమీద ఆ ఇంట్లోని మనుష్యుల మీదా పగ తీర్చుకోవాలన్న ప్రతీకార వాంఛ వరూధినిలో ప్రవేశిస్తాయి. పల్లెటూళ్లో తను కోరుకునే విలాసజీవితం లభించదని తెలుసుకున్న వరూధిని తనకు తొత్తులా మారిన భర్తను సాంబయ్య మీదకు ఉసిగొల్పి పల్లెటూళ్లో వున్న పొలమంతా అమ్మించి పట్టణానికి ప్రయాణమవుతుంది. కేవలం అందాన్ని, సులభంగా డబ్బు తెచ్చిపెట్టే వ్యాపారాన్ని నమ్ముకుంటుంది వరూధిని. అందుకే పట్టణంలోని విలాసాలకు, సుఖాలకు అలవాటుపడిన వరూధిని రామనాథబాబుతో సంబంధాన్ని పెట్టుకుంటుంది. తన అందానికి, తానిచ్చే సుఖానికి తన భర్తలాగానే రామనాథబాబు కూడా లొంగిపోతుందనే భ్రమలో ఉంటుంది వరూధిని. కానీ రామనాథబాబు వరూధిని అందాన్ని, ఆస్తిని కొల్లగొట్టి ఆమెను సర్వనాశనం చేసి వదులు తాడు. తన అందంతో ఈ లోకాన్నే గెలవచ్చుననుకున్న వరూధిని చివరకు ఆత్మహత్య చేసుకుంటుంది. తన జీవితాన్ని తానే నాశనం చేసుకున్న పాత్రలో వరూధినిని చూపిస్తుంది రచయిత్రి. సంఘపరంగా ఎంతో శారీరక మానసిక హింసకు గురవుతున్న స్త్రీ మంచి భర్త రావాలని కోరుకుంటుంది. కానీ భర్త నచ్చలేదనో, సౌకర్యాలు సరిగా లేవనో వంకతో మంచి భర్త లభించినా అంగీకరించలేక నిరంతరం దేన్నో కోరుకుని భంగపడి ఆత్మహత్యలకు పాల్పడుతున్న స్త్రీలకు ప్రతినిధిగా వరూధిని పాత్రను ఈ నవలలో చిత్రించారు..

**4.2. సమత**

మట్టిమనిషి నవలలోని వరూధినిలాంటి పాత్రనే సమత నవలలోనూ చూపిస్తారు రచయిత్రి. దాదాపు 1967–68 ప్రాంతంలో రాసిన ఈ సమత నవలలో వివాహబంధంలో ఇమడలేక అందులోంచి బయటపడ్డ ఒక స్త్రీ జీవితాన్ని వివరిస్తారు రచయిత్రి. అసాధారణమైన అందచందాలు ఉన్న స్త్రీలు తమ చుట్టూ ఉన్న వాళ్ళను తక్కువగా చూస్తూ, వాళ్ళ కంటే తమను తాము ఎక్కువగా అంచనా వేసుకుంటూ జీవిస్తారు. నిరంతరం ఏదో సాధించాలన్న తపనతో రగిలి పోతూ తమ జీవితాల్ని తామే నాశనం చేసుకుంటారు అనే విషయాన్ని అరుంధతి పాత్ర ద్వారా ఈ నవలలో చూపిస్తుంది. స్త్రీ మీద ఆధారపడి పుట్టినిల్లు మెట్టినిల్లు మనుగడ సాగిస్తుంటాయి. స్త్రీగా పుట్టినప్పటినుండి సంఘంలో ఎలా వుండాలో, పుట్టింట్లో అత్తింట్లో ఎలా మసలుకోవాలో తెలియజేస్తారు. కానీ స్త్రీగా పుట్టిన వాళ్ళకు కూడా హక్కులుంటాయనే వాస్తవాన్ని ఎవరూ అంగీకరించరు.

ఈ నవలలోని అరుంధతి పాత్ర స్త్రీగా తన అస్తిత్వాన్ని గుర్తించడంతో పాటు తన హక్కుల కోసం కూడా పోరాటం చేస్తుంది. అలా హక్కుల గురించి అడగడమే పెద్ద నేరంగా భావిస్తుంది సంఘం. కానీ వ్యక్తిత్వం పేరుతో తాను తీసుకొనే నిర్ణయాలు తన జీవితాన్నే కాకుండా తన కూతురి జీవితాన్ని కూడా నాశనం చేసిన విధానం ఈ నవలలో మనకు కనిపిస్తుంది. వివాహ వ్యవస్థలోని కట్టుబాట్లను, నియమాలనూ ఉల్లంఘించి ఏదో సాధించాలనే తపనతో ఇల్లు విడిచిన అరుంధతి రాజారావు అనే రాజకీయ నాయకుడికి ప్రేయసిగా మారుతుంది. రాజారావుతో పని చేయించు కోవాలంటే ముందుగా అరుంధతిని ఆశ్రయించాలి. సంఘంలో పేరు, పలుకుబడి, హోదా కలిగిన ఎంతో మందిని తన చుట్టూ తిప్పుకుంటూ తనను దెబ్బతీసిన ఈ సంఘంమీద, పురుషాధిక్య సమాజంమీద కసి తీర్చుకుంటున్నానని సంతోష పడుతున్న అరుంధతి పాత్ర చివరలో విషాదాంతంగా ముగుస్తుంది.

### 3. మరీచిక

1978లో ఆంధ్రభూమి వారపత్రికలోను, 1979లో పుస్తకరూపంలోను వెలువడిన ఉత్తమ నవల మరీచిక. ప్రభుత్వం చేత నిషేధించబడిన నవలగా కూడా ప్రసిద్ధి చెందింది. సంపన్న నాగరిక కుటుంబాలకు చెందిన శబరి, జ్యోతి అనే ఇద్దరి స్నేహితురాళ్ళ కథను ఇతివృత్తంగా తీసుకుని ఈ నవల రాశారు వాసిరెడ్డి సీతాదేవి. ఇందులో రెండు భిన్న నేపథ్యాలకు చెందిన సంస్కృతులను వివరించారు రచయిత్రి. హిప్పీ సంస్కృతిలో చిక్కుకుని అందులోంచి బయటికి రాలేకపోయిన శబరి తన జీవితాన్ని నాశనం చేసుకుంటుంది. రొటీన్ ప్రపంచం నుండి భిన్నంగా వ్యవహరించాలనే ఆలోచనతో ప్రమాదకరమైన మత్తుమందులకు బానిసలై కలల ప్రపంచంలోనే విహరిస్తుంటారు హిప్పీలు. తమ జీవితం గొప్పదని సమర్థించుకోవడానికి పురాతన సంస్కృతిని లోపాలమయంగా చెప్తుంటారు. అందుకే ఈ నవలలో ఈ హిప్పీలు "ఈ ఇరవయ్యవ శతాబ్దపు నాగరికతకు పుట్టిన వికృత శిశువులు" అని వర్ణిస్తారు రచయిత్రి. ఏదో అసంతృప్తికి లోనై రొటీన్ లైఫ్ నుండి బయటపడడానికి ఈ హిప్పీల సంస్కృతిలో చిక్కుకుని అందులోంచి బయటికి రాలేక హిప్పీల లోనే కలిసిపోతుంది శబరి.

ఇక ఈ నవలలోని మరొక పాత్ర జ్యోతి. ఆదర్శవంతుడైన తండ్రి పెంపకంలో ఒక చైతన్యాన్ని, ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సంతరించుకున్న ఆదర్శవంతమైన పాత్రగా జ్యోతి పాత్రను తీర్చిదిద్దారు రచయిత్రి. యువతరంలో ఆదర్శానికీ ఆచరణకూ మధ్య జరిగే సంఘర్షణలను బలంగా చిత్రించారు. అందుకే జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను నైతిక బలంతో ఎదుర్కోవాలని సూచిస్తారు. శాస్త్రీయమైన అవగాహనతో పరిష్కరించుకుంటే జీవితం మరీచికలా మారుతుందని ఈ నవలలో తెలియజేస్తుంది రచయిత్రి.

### 4.4. రాబందులు రామచిలుకలు

వాసిరెడ్డి సీతాదేవి రచనల్లో అత్యంత ప్రజాదరణ పొందిన నవల రాబందులు రామచిలుకలు. గ్రామీణవ్యవస్థలో కీలక పాత్ర పోషించే పంచాయితీరాజ్ వ్యవస్థలోని అవినీతిని, డొల్లతనాన్ని బట్టబయలు చేసే నవల రాబందులు రామచిలుకలు. ఎంతోమంది త్యాగం చేసి తమ ప్రాణాలు అర్పించి సాధించిందే ఈనాడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. కానీ ఆనాడు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులకు ఈనాడు గౌరవం లేదు. ఆ కోణంలో రాసిన నవలే అయినా దాదాపుగా స్త్రీ సమస్యలను కూడా చిత్రించారు సీతాదేవి. పొగడ్తలకు లొంగకుండా నిస్వార్థంగా నిరాడంబరంగా జీవించే ధర్మయ్య పాత్రను ఆదర్శవంతంగా చిత్రించారు. కేవలం దేశం మీద భక్తితోనే స్వాతంత్ర్యం కోసం పాటుపడ్డానని చెప్పే ధర్మయ్య ప్రభుత్వం నుంచి వచ్చే అవార్డులను, భూములను, ఇళ్లను తిరస్కరిస్తాడు. కానీ పంచాయితీ రాజ్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని రాజకీయాలు నడిపి రక్తసంబంధీకులను కూడా అవసర మైతే అడ్డు తొలగించుకోవాలని చూసే పరమేశం, అవినీతిపరుడైన నరహరి, ప్రజాధనం కొల్లగొట్టే లూ అనే కాంట్రాక్టరూ మొదలైన అనేకరకాల పాత్రలను నేటి రాజకీయవ్యవస్థలోని అవినీతి పరులకు ప్రతిరూపంగా ఈ నవలలో కనిపిస్తారు.

ఇక ఈ నవలలోని స్త్రీ పాత్రలను రకరకాల మనస్తత్వాలతో వైవిధ్యంగా మలిచారు రచయిత్రి. సునంద పాత్రను ఎంత ఔన్నత్యంగా తీర్చిదిద్దాలని ప్రయత్నం చేసినా చివరకు సంఘంలోని అవినీతిపరులను ఎదుర్కొలేక అవమానాలకు గురవుతుంది సునంద. ధర్మయ్య ఆదర్శాలకు అనుగుణంగా పెరిగిన సునంద గ్రామీణ వ్యవస్థలో

గూడు కట్టుకు పోయిన అవినీతి చీడను వదిలించాలని ప్రయత్నం చేసి భంగపడుతుంది. తాను నమ్మిన ఆశయాల కోసం తన వ్యక్తిగత జీవితాన్నే ఫణంగా పెడుతుంది. వైవాహిక జీవితం విచ్ఛిన్నమైనా వెనుదీయకుండా నమ్మిన ఆశయాలకు కట్టుబడి ఉంటుంది. అంతేగాక సంఘసేవికగా మారి ప్రజలకు నిస్వార్థంగా సేవచేయాలని చూసినా అడుగడుగునా ఎదురయ్యే అడ్డంకులు ఆమెను ఏ పనీ చేయనీయకుండా అడ్డుపడతాయి. స్త్రీలు సాంఘికంగా, రాజకీయంగా ఎదగలేని ఒక పరిస్థితిని ఈ నవలలో సీతాదేవి వివరిస్తారు. ఆడవాళ్ళు రాజకీయంగా ఎదగడం చూసి ఊర్చుకోలేని రాజకీయ నాయకులు ఈ నవలలో మనకు అడుగడుగునా దర్శనమిస్తారు.

ఇక ఈ నవలలో పేర్కొనదగిన మరొక స్త్రీ పాత్ర పరమేశం కూతురు రాణి. స్వార్థరాజకీయాలు నడిపి ప్రజాధనాన్ని అక్రమంగా కూడబెట్టిన పరమేశం కూతురు రాణి ఆ సంపాదనంతా తన విలాసాలకు ఖర్చుపెడుతుంది. అనవసరమైన ఆడంబరాలు, అతిశయాలకు పోయి విలాసవంతంగా గడపి తన జీవితమంతా నాశనం చేసుకునే స్త్రీకి ప్రతినిధిగా చిత్రించారు రచయిత్రి. ఈ నవలలోని మరో పాత్ర లలిత. లలిత పాత్ర కూడా రాణి పాత్రలాగే మనకు కనిపిస్తుంది. విలాసవంతమైన జీవితాన్ని కోరుకుని తప్పటడుగులతో తన జీవితాన్ని నాశనం చేసుకున్న పాత్ర లలిత. ఈ పాత్రలన్నిటినీ ఒక ప్రయోజనంతోనే సృష్టించారు రచయిత్రి. సమాజంలో మంచి చెడు అనే రెండు దృక్పథాలు ఉన్నాయి. తాత్కాలికంగా అధర్మం నెగ్గినా అంతిమ పోరాటం మాత్రం ధర్మానిదే అనే విషయాన్ని ఆయా పాత్రల ద్వారా నిరూపించారు వాసిరెడ్డి సీతాదేవి.

**4.5. వైతరణి**

స్త్రీ జీవితంలోని వివిధ కోణాల్ని వైవిధ్యభరితంగా చిత్రించిన నవల వైతరణి. ఈ నవలలో నాగమ్మ పాత్ర కాలానికి ఎదురీది నిలువలేక ఆత్మహత్య చేసుకున్న పాత్రగా చిత్రించారు రచయిత్రి. నాగమ్మను అపురూపంగా చూసుకునే తల్లిదండ్రులను, అన్నలను చూసి ఆమె వదినలు నాగమ్మ పైన ఈర్ష్య పెంచుకుంటారు. భర్త చనిపోయి కూతురైన పార్వతితో అన్నల పంచన చేరిన నాగమ్మను తమ ఆస్తి కొల్లగొట్టడానికి వచ్చినట్లుగా భావించి ఆమె పైన మరింత ద్వేషాన్ని పెంచుకుంటారు వదినలు. అంతేగాక వాళ్ళ కూతురుకంటే అందంగా వున్న పార్వతి పట్ల కూడా అసూయను పెంచుకుంటారు. ఇక అక్కడనుండి నాగమ్మ జీవితంలోని మలుపులను చాలా హృద్యంగా వివరిస్తారు రచయిత్రి. నాగమ్మను, ఆమె కూతురు పార్వతిని అసూయతో ఎన్నో బాధలు పెట్టిన వదినలు పార్వతిని ముసలి శాడిస్టు కిచ్చి పెళ్లి చేస్తారు. ఈ సమయంలో పార్వతి తీసుకున్న నిర్ణయం ఆమె జీవితాన్ని మాత్రమే కాకుండా తన తల్లియైన నాగమ్మ జీవితాన్ని కూడా అతలాకుతలం చేస్తుంది. తన చదువుపట్ల, జీవితం పట్ల, వివాహం పట్ల సరిగా ప్రవర్తించని మేనమామల మీద పగ తీర్చుకోవాలని భావించిన పార్వతి సూర్యనారాయణతో లేచిపోతుంది. కూతురు లేచి పోవడంతో అవమానాన్ని భరించలేని నాగమ్మ సంఘానికి భయపడి ఆత్మహత్య చేసుకుంటుంది. ఈ నవల స్త్రీ జీవితంలోని అనేక మైన సమస్యలను చిత్రించినా స్త్రీకి స్త్రీయే శత్రువు అనే విషయాన్ని కూడా తెలియజేస్తుంది.

**6. అర్చన**

స్త్రీ జీవితాన్ని విభిన్న కోణంలో చిత్రించిన నవల అర్చన. సంఘం మగవాడికి ఇచ్చినంత ప్రాధాన్యత స్త్రీకి ఇవ్వదు. అంతేగాక స్త్రీగా పుట్టినప్పటినుండే అనేక ఆంక్షలను బలవంతంగా స్త్రీపైన రుద్దుతారు. చదువుకుని ఎంత ఎదిగినా తల్లిదండ్రులు స్త్రీని తమ గుండెల మీద కుంపటిగానే భావిస్తారు. శీలం స్త్రీకి మాత్రమే ప్రధానం అని

భావిస్తారు గాని మగవాడి విషయంలో ఆ పట్టింపులుండవు. పైపెచ్చు మగవాడి జీవితంలో అతనికి ఉండే ఏ సంబంధాలైనా అవి అతనికి అదనపు అర్హతలులాగే పరిగణింపబడతాయి. ఇలా ఇందుకు అని ప్రశ్నించిన స్త్రీలను విచిత్రంగా చూస్తుంది సమాజం. దాదాపు ఇదే విషయాన్ని ఈ నవలలో చిత్రిస్తారు రచయిత్రి. సమాజంలో మగవాడికి ఉన్నంత స్వేచ్ఛ స్త్రీలకు ఎందుకు లేదు? శీలం స్త్రీలకు మాత్రమేనా? పురుషుడికి అక్కర్లేదా? అని ప్రశ్నించిన అర్చనకు సమాధానం దొరక్కపోగా ఆమెను విచిత్రంగా చూస్తారు. చిన్నప్పటి నుండి అర్చనతో పెరిగిన తరుణ్'కు స్త్రీ జాతి పట్ల, స్త్రీల పట్ల ఎంతో అభిమానం ఉన్నప్పటికీ ఒకానొక దశలో అర్చన శీలాన్ని అపార్థం చేసుకుంటాడు. అంతేగాక స్త్రీజాతి మొత్తం ఇలాగే ఉంటారని వారిని ద్వేషిస్తాడు తరుణ్. కానీ తర్వాత నిజాన్ని తెలుసుకున్న తరుణ్ అర్చన పట్ల మాత్రమేగాక మొత్తం స్త్రీ జాతి పట్లా గౌరవాన్ని పెంచుకుంటాడు. అంతేగాక స్త్రీల సమస్యలను సానుభూతితో అర్థంచేసుకుని వారికి సహాయ పడాలని భావిస్తాడు. ఈ నవల ధైర్యంగా ప్రశ్నించే స్త్రీలకు సంకేతంగా రచించారు రచయిత్రి. స్త్రీ పురుషులిద్దరూ జన్మ పరంగా ఒకేలా పుట్టినా సంఘం వారిని విభిన్నంగా చూడటాన్ని ప్రశ్నించాలని, స్త్రీ సమస్యలను మానవీయకోణంలో అర్థం చేసుకుని పురుషులు కూడా స్త్రీలకు సహకరించాలని సందేశమిస్తుంది ఈ నవల.

**ముగింపు**

స్త్రీ సమస్యలను ఎక్కువగా తన రచనల్లో తెలియజెప్పిన వాసిరెడ్డి సీతాదేవి కేవలం అయిదవ తరగతిలోనే చదువు మానేసిన జీవితాన్ని మాత్రం క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఆలోచనల కంటే అనుభవాలు గొప్పవని తన ప్రతీ రచనలోను తెలియజేశారు. సంప్రదాయాల సంకెళ్లు దాటి వాస్తవ ప్రపంచంలో స్త్రీలు పడుతున్న వేదనలకు, అణచి వేతలకు తన రచనల్లో పెద్దపీట వేశారు. తాను రాసిన మరీచిక నవల నిషేధానికి గురైనా తాను నమ్ముకున్న సిద్ధాంతాన్ని విడిచిపెట్టలేదు, వ్యవస్థనూ, వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడమూ ఆపలేదు. పురుషుల దురహంకారాన్ని, స్త్రీలపై వివిధ రూపాలలో వారు చేస్తున్న అత్యాచారాల్ని తన రచనల్లో ఖండించారు. స్త్రీ జీవితంలోని వివిధ కోణాల్ని తన రచనల్లో వ్యక్తపర్చారు. విధిరాత బాగోలేని స్త్రీలను వారి సమస్యలను వివరిస్తూనే, చేజేతులా తమ జీవితాల్ని నాశనం చేసుకునే స్త్రీలను కూడా తన నవలల్లో చూపించారు వాసిరెడ్డి సీతాదేవి.

....................

**ఉపయుక్త గ్రంథాలు:**

1. వాసిరెడ్డి సీతాదేవి జీవితం – సాహిత్యం, కె.పి.అశోక్ కుమార్, సాహిత్య ప్రస్థానం, మే 2007, సంపుటి 5, సంచిక 19,
2. వాసిరెడ్డి సీతాదేవి మరీచిక నవల, శిలాలోలిత, భూమిక మాసపత్రిక, 5 అక్టోబర్, 2007.
3. ఆలోచనాత్మక నవల 'మరీచిక', బి. మల్లీశ్వరి, నవ తెలంగాణ, 26 మార్చి 2017
4. వామపక్షజాలం కథల వాసిరెడ్డి సీతాదేవి, శీలా సుభద్రాదేవి, సారంగ, 1 ఫిబ్రవరి 2020
5. డా. వాసిరెడ్డి సీతాదేవి సాహిత్యం – 4, నవలలు